ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 17 మార్చి 2025

నేటి నుంచే టెన్త్ పరీక్షలు

- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకూ..

జిల్లావ్యాప్తంగా 135 కేంద్రాలు సిద్ధం
హాజరుకానున్న 32,803 మంది విద్యార్థులు
ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

అనంతపురం విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి-2025 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 17వ తేదీ మొదలై 31వతేదీ, ఏప్రిల్ 1 వరకూ పరీక్షలు జరగనున్నాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో రెగ్యులర్ పరీక్షలు 135 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. 32,803 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 597 స్కూళ్ల నుంచి 31,009 మంది రెగ్యులర్ విద్యార్థులు, మరో 1794 మంది ప్రైవేట్ విద్యార్థులు(గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు) పరీక్షలకు హాజరు కానున్నారు. 135 కేంద్రాల్లో 98 ఏ- సెంటర్లు, 37 బీ-సెంటర్లు ఉన్నాయి. ప్రశ్నపత్రాలను ఇప్పటికే పోలీస్టేషన్లకు చేర్చారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ సోమవారం కేంద్రాలకు తరలించనున్నారు. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా పరీక్షల అబ్జర్వర్ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబుతోపాటు ఇతర అధికారులకు ఆర్‌జేడీ శామ్యూల్ పరీక్షల నిర్వహణపై ఆరా తీసి ఆదేశాలిచ్చారు. ఎక్కడా కాపీయింగ్‌కు, మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని ఆదేశాలిచ్చారు.

ఏర్పాట్లు పూర్తి

పరీక్షలకు జిల్లా విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 135 కేంద్రాలకు 270 మందిని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్ 30 మందిని, 10 మందిని ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా, ఏడీఓలను 21మంది, 1836 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఆత్మకూరు మోడల్ స్కూల్, కూడేరు జడ్పీ హైస్కూల్, తాడిపత్రి మోడల్ స్కూళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. అన్ని కేంద్రాల్లో బెంచీలు, తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టికెట్ చూపించి ఉచిత ప్రయాణం చేసేలా ఆదేశాలు ఇచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. ఏదైనా సమస్య వస్తే సంప్రదించడానికి కేఎస్‌ఆర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో రమణ 8639185929, ఫణిరాజ్ 9441282559 నెంబర్లను విద్యాశాఖాధికారులు అందుబాటులో ఉంచారు.

జాగ్రత్తలు తప్పనిసరి

తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులు హడావుడితో చేసే చిన్న చిన్న పొరపాట్లకు మార్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. ఒక్కోసారి పేపర్లు సైతం తారుమారయ్యే ప్రమాదమూ ఉంది. విద్యార్థులు అరగంట గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ప్రధానంగా హాల్‌టికెట్, ప్యాడ్(అట్ట)పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్, ఇతర పరీక్షల సామగ్రి తీసుకెళ్లాలి. కేంద్రాల్లోకి వెళ్లే ముందు...సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్‌లు, స్మార్ట్ బ్యాండ్, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు తమకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో తమ వివరాలున్నాయో లేవో చూసుకోవాలి. ఒక వేళ తమ వివరాలు తప్పుగా ఉంటే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలి. 24 పేజీల జవాబు పత్రంలో గానీ, గ్రాఫ్ పేపర్లపైగానీ, మ్యాప్ పేపర్లపైగానీ ఏ విద్యార్థి తన హాల్ టికెట్ నెంబర్ గానీ, పేరు గానీ రాయరాదు. 24 పేజీల సీరియల్ నెంబర్ మాత్రం తప్పనిసరిగా గ్రాఫ్, మ్యాప్ పేపర్‌పై రాయాల్సి ఉంటుంది. 12 పేజీల బుక్‌లెట్ బయాలజీ, ఫిజిక్స్, సంస్కృతం, ఒకేషనల్ సబ్జక్టులకు మాత్రమే ఇస్తారు. గణితం పరీక్షల రోజు గ్రాఫ్ పేపర్‌ను, సోషల్ పరీక్ష రోజు మ్యాప్ పేపర్‌ను 24 పేజీల బుక్‌లెట్‌కు దారంతో కట్టి(ట్యాగ్) ఇచ్చారో లేదో గమనించాలి. ట్యాగ్ చేయకుండా ఇస్తే గ్రాఫ్, మ్యాప్ పేపర్లు మిస్ అయి మార్కులు కోల్పోయే ప్రమాదం ఉంది.



రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో నంబర్లు వేస్తున్న సిబ్బంది



హాల్ టికెట్ నంబర్లు చెక్ చేసుకోడానికి పరీక్ష కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థులు

ఆరోగ్యం... ఆహారం.. ముఖ్యం

పరీక్షలున్న రోజుల్లో ఆరోగ్యంతోపాటు, తీసుకునే ఆహారం కూడా ముఖ్యం. ఈ పక్షం రోజులు విద్యార్థులను తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకోవాలి. విద్యార్థులు తీసుకునే ఆహారంపై, వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకూ విద్యార్థులను కంటికి రెప్పలా కాచుకోవాలి. ఏడాది కాలంగా చదివిన పిల్లలు పరీక్షలు రాయబోతున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా ఆ ప్రభావం పరీక్షలపై పడుతుంది. వాళ్లకు అందించే ఆహారంతోపాటు తగినంత విశ్రాంతి కూడా అవసరం. ఇవి రెండు పిల్లలకు అందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్ సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

అనంతపురం క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల సమీప ప్రాంతాల్లో జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసి వేయించామన్నారు. 144 సెక్షన్ అమలుచేసి ప్రత్యేక పోలీసు బృందాలతో పెట్రోలింగ్ చేపట్టామని ఓ ప్రకటనలో తెలిపారు.

పది నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులు

ఏసీ, డీవైఈఓ, ఎంఈఓ, మరో ఇద్దరికి..

అనంతపురం విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కడప ఆర్జేడీ శామ్యూల్ కొరడా ఝుళిపించారు. పరీక్షల విధుల్లో ఇష్టారాజ్యంపై 'ఇంత నిర్లక్ష్యమా..!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించిన కథనం ఉన్నతాధికారుల్లో చలనం తెచ్చింది. ఇన్విజిలేటర్ల నియామకంలో గందరగోళంపై సంబంధిత అధికారులపై ఆర్జేడీ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. పరీక్షల విధులకు కళ్లులేని వారు, మెడికల్ లీవ్‌లో ఉన్నవారు, రిటైరైన వారు, బాలింతలకు డ్యూటీలు వేశారు. కొందరికి డబుల్ ఆర్డర్లు కూడా జారీ చేశారు. దీనిపై ఆర్జేడీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) గోవింద్ నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి, మరో ఇద్దరు క్లర్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురం టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంతోనే తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, డీపీఎం ఆనంద్, జిల్లా పర్యటక శాఖాధికారి జయకుమార్, డ్వామా పీడీ సలీంబాషా పాల్గొన్నారు.

నీ సేవలకు సలాం..

పోలీసు జాగిలానికి ఘనంగా వీడ్కోలు



రిటైర్డ్ స్నిఫర్ డాగ్ (రాజా)ను సన్మానిస్తున్న ఆర్పీఎఫ్ డీఎస్సీ మురళీకృష్ణ

గుంతకల్లు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు అద్భుతమైన సేవలు అందించిన జాగిలానికి ఘనమైన రీతిలో వీడ్కోలు పలికారు. జాగిలం రిటైర్మెంట్ ఫంక్షన్‌కు అట్టహాసంగా చేశారు. గుంతకల్లులోని ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్‌లో రాజా అనే స్నిఫర్ పదేళ్లు విధులు నిర్వహించింది. నిబంధనల మేరకు పదవీ విరమణ చేయాలి. ఆమేరకు ఆదివారం ఉదయం ఆర్పీఎఫ్ అధికారులు మోదినాబాద్ సమీపంలోని డాగ్ స్క్వాడ్ స్టేషన్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యురిటీ కమాండెంట్ (డీఎస్సీ) మురళీకృష్ణ మాట్లాడుతూ.. పదేళ్లపాటు స్నిఫర్ డాగ్ రాజా రైళ్లల్లో పేలుడు పదార్థాలను కనుగొనే టాస్క్‌లో విశేష సేవలందించిందన్నారు. రిటైర్మెంట్ తర్వాత రాజాను నాందేడ్‌లోని అనిమల్ సొసైటీ సంరక్షణకు పంపుతున్నామన్నారు. జాగిలం శేష జీవితం సాఫీగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం స్నిఫర్ డాగ్‌ను సన్మానించి, పోలీసు జీపుపై కొంతదూరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అబ్రహం, ప్రదీప్ బాబు, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండుతున్న మిరప..! 7

ప్రభలపై దేవదేవుడి వైభవం 7



ఇదేందయ్యా.. ఇది..!

డిస్‌ప్లేకి అనుగుణంగా నిలవని బోగీలు
ఇబ్బంది పడుతున్న రైలు ప్రయాణీకులు



బీ-3 కోచ్ డిస్‌ప్లే వద్ద నిలిచిన ఎస్-1 బోగీ

గుంతకల్లు, మార్చి16(ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కాలంటే ఎక్కాల్సిన బోగీ ప్లాట్‌ఫాంపై ఎక్కడికొస్తుందో చూసుకుని, అక్కడ వేచిచూస్తారు ప్రయాణీకులు. బోగీ రాగానే ఎక్కి, వెళ్లిపోతుంటారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో మాత్రం డిస్‌ప్లేకి అనుగుణంగా బోగీలు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాంలలో రైలు రాకముందే ఏ బోగీ ఎక్కడ వచ్చి నిలుస్తుందో తెలుపుతూ డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల్లో నంబరును ప్రదర్శిస్తారు. ఆ బోర్డులకు అనుగుణంగా రైళ్ల బోగీలను నిలపట్లేదు. డిజిటల్ డిస్‌ప్లే బోర్డు సమాచారం ప్రకారం బోగీ వస్తుందని ప్రయాణీకులు లగేజీతో ప్లాట్‌ఫాంపై ఎదురుచూసి, చివరకు అక్కడ కాకుండా కాస్తదూరంలో నిలుపుతుండటంతో సమస్య ఎదుర్కొంటున్నారు. లగేజీ లేకపోతే ఇబ్బంది లేదు కానీ, వృద్ధులు, లగేజీ, చిన్న పిల్లలు ఉంటే మాత్రం ప్రయాణీకులు పడుతూ.. లేస్తూ.. బోగీ వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కొన్ని రైళ్లు కేవలం ఐదు, పది నిమిషాలు మాత్రమే నిలుస్తాయి, కనుక ఆపసోపాలు పడాల్సి వస్తోందని ప్రయాణీకులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని, డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల వద్దే బోగీలు సక్రమంగా నిలిచేలా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.32 (సోమవారం సాయంత్రం)
సహేరీ : 5.09 (మంగళవారం ఉదయం)

పచ్చని చెట్లకు వైసీపీ పురుగు..!

గత ప్రభుత్వంలో దోపిడీ నిర్ణయం

అనంత ఖైదీల వ్యవసాయం క్షేత్రం..
ఎంతో ప్రసిద్ధి..
సహజ సిద్ధంగా పంటలు పండిస్తారు..
ఇక్కడ పండే మామిడికి దేశవ్యాప్తంగా పేరు..
కొనుగోలు చేసేందుకు పోటీపడేవారు..
పక్క రాష్ట్రాల్లో సైతం విపరీతమైన డిమాండ్..
అలాంటి ప్రతిష్టాత్మక క్షేత్రంపై వైసీపీ కన్ను పడింది..
గత ప్రభుత్వంలో దోపిడీకి తెరలేపారు..
మామిడి చెట్ల లీజును పదేళ్లకు పొడిగించారు..
అది కూడా వైసీపీ నాయకుడికి కట్టబెట్టారు..
దిగుబడి అమ్ముకుని.. భోంచేసిన ఆ నేత..
చెట్ల పరిరక్షణను గాలికొదిలేశాడు..
దీంతో చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి..
ఒకటి కాదు.. రెండు కాదు..
ఏకంగా 1200 చెట్లు ఎండిపోయినట్లు సమాచారం..
ఇది జైళ్ల శాఖకు తీవ్ర నష్టం..
అనంత వాసులకు తియ్యని పండ్లను అందించిన క్షేత్రం..
కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడింది..

ఓపెన్ ఎయిర్ జైలులో మామిడి లీజు పదేళ్లకు పెంపు
వైసీపీ నాయకుడికే కట్టబెట్టిన వైనం
చెట్లపై తీవ్ర నిర్లక్ష్యం
1200 వరకు ఎండిపోయినట్లు సమాచారం
జైలుకు తీవ్ర నష్టం
ఏడాది లీజు కూడా ఎగ్గొట్టిన వైసీపీ నేత

జైలులో ఎండిపోయిన మామిడి చెట్లు





బుక్కరాయసముద్రం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అనంతపురం ఖైదీల వ్యవసాయ క్షేత్రం అంటే టక్కున గుర్తుకొచ్చేవి మామిడి పండ్లు. భలే రుచి అనేవారు. ఏళ్లుగా కష్టపడి పెంచిన మామిడి తోట కనుమరుగైపోతోంది. చాలామంది జైలు అధికారుల కృషి, జీవిత ఖైదీల కష్టంతో ఓపెన్ ఎయిర్ జైలులో 200 ఎకరాలుపైగా రాష్ట్రంలోనే అతిపెద్ద మామిడి తోట అభివృద్ధి చేశారు. మామిడి పంట ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. అలాంటి మామిడి చెట్లు ఎండిపోతున్నాయి. భవిష్యత్తులో అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో మామిడి పంట పూర్తిగా అంతరించి పోయే ప్రమాదం ఉంది. ఓపెన్‌ఎయిర్ జైలులో 400 మామిడి చెట్లు ఎండిపోయాయని అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి 1200 పూర్తిగా ఎండిపోయినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వస్తోంది.

జైలులో ఎండుతున్న మామిడి తోటలు

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో 200 ఎకరాలుపైగా మామిడి పంట సాగు చేస్తున్నారు. 4280 చెట్లు ఉన్నాయి. ఇక్కడ పండించే పంటకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రుచికి మారుపేరు. సహజ సిద్ధంగా పండిస్తారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఈ మామిడి పండ్లకు డిమాండ్ ఉంది. మంచి ధర కూడా పలుకుతుంది. మామిడి సీజన్ రాగానే జైలులో పండించిన పండ్లకు గిరాకీ ఏర్పడుతుంది. ప్రస్తుతం ఈ వ్యవసాయ క్షేత్రంలో మామిడి చెట్లు వందల్లో ఎండిపోయాయి. ప్రభుత్వానికి ఏటా ఆదాయం తెచ్చే పంటపై నిర్లక్ష్యం వహించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. చెట్లకు నీరు పెట్టకనే ఈ దుస్థితి దాపురించిందని తెలుస్తోంది. ప్రస్తుతం మామిడి చెట్లకు వైరస్ సోకడంతోపాటు నీరు పెట్టకపోవడంతోనే ఎండిపోయినట్లు సమాచారం.

నిర్లక్ష్యం ఎవరిది?

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో పండించిన మామిడి పంటకు గతంలో ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో బహిరంగ వేలంపాట వేసేవారు. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. మామిడి పంటను పదేళ్ల లీజుకు వేలంపాట నిర్వహించుకునేలా మార్పులు చేసింది. జైలులోని మామిడి చెట్లను పదేళ్లపాటు బుక్కరాయసముద్రం మండలంలోని నీలంపల్లికి చెందిన ఓ వైసీపీ నేత వేలం పాట ద్వారా లీజు దక్కించుకున్నాడు. తొలి సంవత్సరం 2022లో కనీస ధర రూ.26.50 లక్షలకు దక్కించుకున్నాడు. ఏటా కనీస ధరపై ఐదుశాతం అదనంగా చెల్లించేలా ఒప్పందం కుదర్చుకున్నారు. 2023లో రూ.27.82 లక్షలు చెల్లించాడు. 2024 ఏడాదికి సంబంధించి మూడో సంవత్సరం లీజు సొమ్ము 29.21 లక్షలు చెల్లించాల్సి ఉంది. గతేడాదికి సంబధించి జైలులో పండిన పంట అంతా అధికారులకు మస్కా కొట్టించి లీజుదారుడు విక్రయించాడు. అనంతరం జైలుకు లీజు డబ్బు ఎగ్గొట్టాడు. అప్పటి నుంచి జైలులో మామిడి చెట్ల పరిరక్షణపై అధికారులు నిర్లక్ష్యం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అటు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడింది. ఇటు జైలులో ఏళ్లుగా ఉన్న మామిడి చెట్లు ఎండిపోవడంతో పెను నష్టం వచ్చింది. లీజు ఎగ్గొట్టడంతో వైసీపీ నాయకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి, వదిలేశారు.

మామిడి తోటను అభివృద్ధి చేస్తాం

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో మామిడి తోటను అభివృద్ధి చేస్తాం. ఎండిపోయిన చెట్లను కొట్టి వేయకుండా కాపాడుకుంటాం. గతేడాది లీజుదారుడు మామిడి చెట్లను పట్టించుకోకపోవడంతోనే ఎండిపోయాయి. ప్రస్తుతం లీజు రద్దయింది. చెట్ల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. 400పైగా మామిడి చెట్లు ఎండిపోయాయి. వాటిలో కొన్నింటిని శాస్త్రవేత్తల సూచన మేరకు మందులు పిచికారీ చేసి రక్షించుకుంటున్నాం.

-క్రాంతిరాజ్, జైలు సూపరింటెండెంట్

నాడు అధ్వానంగా.. నేడు అందంగా!



అప్పుడు

బొమ్మనహాళ్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవనహళ్లి, బండూరు గ్రామాల రోడ్డు బొమ్మనహాళ్ వరకు రోడ్డు అధ్వానంగా ఉండేది. వైసీపీ హయాంలో టిప్పర్ల రాకపోకలతో కంకర తేలి, అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయం కావడం, వాటికి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు పొడవునా గోతులు ఏర్పడ్డాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెలల్లోనే రోడ్డు వేశారు. వాహనదారుల కష్టాలు తీరాయి. దీంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పుడు

హమ్మయ్య.. జీడిపల్లి వాసులకు

పరిహారం

మంత్రి కేశవ్ చొరవ

ఏళ్ల నాటి సమస్య పరిష్కారం
ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ
రూ.131 కోట్లు మంజూరు
657 యూనిట్లకు లబ్ధి
తప్పిన ఊటనీటి ముప్పు





గ్రామంలో వివరాలు సేకరిస్తున్న వీఆర్వో ఎర్రిస్వామి

బెళుగుప్ప, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి వాసులకు ఊటనీటి కష్టాలు తప్పనున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో గ్రామస్థులకు పరిహారం మంజూరైంది. ఆ సొమ్ము పంపిణీ దిశగా రెవెన్యూ అధికారులు గ్రామంలో వివరాలు సేకరిస్తున్నారు. దీంతో దశాబ్దంపైగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా జీడిపల్లి రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ కిందిభాగంలో ఉన్న జీడిపల్లిలో ఊట నీటి తిప్పలు మొదలయ్యాయి. ఇళ్లలో నీరు ఊరుతోంది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం ఇవ్వాలని వారు ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో పరిష్కరిస్తామని 2019 ఎన్నికల ప్రచారంలో స్థానిక దేవాలయం ఎదుట ఆ పార్టీ నేతలు ప్రమాణం కూడా చేశారు. ఆ తర్వాత అధికారం వచ్చి ఐదేళ్లున్నా పట్టించుకోలేదు. గతేడాది కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఎమ్మెల్యేగా గెలిచిన పయ్యావుల కేశవ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం రాగానే సమస్య పరిష్కరించే బాధ్యత తనదని ఎన్నికల సందర్భంగా కేశవ్ హామీ ఇచ్చారు. దానిని నెలలు తిరక్కుండానే నిలబెట్టుకున్నారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కింద జీడిపల్లి వాసుల సమస్య పరిష్కరించేందుకు రూ.131 కోట్లు రెండ్రోజుల క్రితం మంజూరు చేశారు. నిబంధనల ప్రకారం సర్వే చేసి 657 యూనిట్ల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. యూనిట్‌ను ఒక కుటుంబంగా పరిగణనలోకి తీసుకున్నారు. యూనిట్‌కు రూ.పది లక్షలు, అందులోనే 18 ఏళ్లు నిండిన వారికి అదనంగా ఒక్కొక్కరికి రూ.పది లక్షల నష్టపరిహారం అందించనున్నారు. లబ్ధిపొందిన 657 యూనిట్లకు సంబంధించిన వారి నుంచి బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్లను వీఆర్వో ఎర్రిస్వామి సేకరిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని మంత్రి నెరవేర్చడంతో సర్పంచ్ వెంకటనాయుడు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వీధుల్లో ప్రవహిస్తున్న ఊట నీరు

ఫటాఫట్

పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

కాపీయింగ్‌కు తావుండదు

'ఆంధ్రజ్యోతి'తో ఆర్జేడీ శామ్యూల్



అనంతపురం విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టామనీ, ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్వహిస్తామని కడప ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, పరీక్షలు పకడ్బందీగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల డ్యూటీలో పాల్గొనే ఇన్విజిలేటర్లు, సీఎస్, డీఓలు, ఇతర సిబ్బందికి ప్రతి రూపాయి అందేలా చూస్తామని తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆంధ్రజ్యోతికి ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: టెన్త్ క్లాస్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు?

ఆర్జేడీ: పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవి. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగినపుడు విద్యార్థుల్లోని ప్రతిభ బయటపడుంది. ఓపెన్ ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లలో స్ట్రిక్ట్‌గా ఉండే అధికారులను నియమించి, కట్టుదిట్టం చేశారు. పది పరీక్షల్లో సైతం ఇదే ఫార్ములాతో ముందుకెళ్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గతంలో పది పరీక్షల్లో ప్రశ్నపత్రాలు తారుమారైన ఘటనలున్నాయి. ఈ ఏడాది ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

ఆర్జేడీ: గతంలోని సంఘటనలు నా దృష్టిలో లేవు. ఈ ఏడాది ఎలాంటి చిన్న సమస్య తలెత్తకుండా చూడాలని డీఈఓ, ఏసీలకు ఆదేశాలిచ్చాం. ప్రధానంగా 135 కేంద్రాల్లోని సీఎస్‌లు, డీఓలు ఉదయం 8 గంటలకే పోలీసు స్టేషన్ల వద్దకెళ్లాలి. 8.30 గంటలు లేదా 9 గంటలకు వెళ్తే హడావుడిలో పొరబాట్లు దొర్లే ప్రమాదం ఉంది. గంట ముందుగా ఉంటే ఏ సమస్యా రాదు.

ఆంధ్రజ్యోతి: గతంలో 10 పరీక్షల డ్యూటీ రెమ్యూనరేషన్, టీఏ, డీఓలు సక్రమంగా అందలేదు. దీన్ని ఎలా పరిష్కరిస్తారు?

ఆర్జేడీ: పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్ ఇస్తోంది. ఈ ఏడాది ఆర్జేడీగా నేను పర్యవేక్షిస్తా. బడ్జెట్ తక్కువైతే మళ్లీ అయినా తెప్పించుకుంటాం. పరీక్షల విధుల్లో పాల్గొనే సీఎస్, డీఓ, ఇన్విజిలేటర్లకు, స్పాట్‌లో పాల్గొనే ఎగ్జామినర్లకు, ఇతర సిబ్బందికి ఇబ్బందులు రాకుండా చూస్తాం. పరీక్షలు, స్పాట్ సిబ్బందికి అందాల్సిన రెమ్యూనరేషన్, టీఏ, డీఏ ఇతర ఏ బిల్లులు ఒక్క రూపాయి కూడా మిస్ కాకుండా చూస్తాం.

ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరెస్టు

కదిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతిని ఆదివారం స్థానిక కోనేరు సర్కిల్ బస్టాప్ వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఓ డిగ్రీ కళాశాలలో హోలీ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటపతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించారు. నిందితుడిని కదిరి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

439 జీఓపై హర్షం

- ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ శర్మ

గుంతకల్లు, మార్చి15(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో బ్రాహ్మణులకు అర్చకత్వాన్ని పారంపర్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 439 జీఓ తీసుకురావడంపై హర్షనీయమని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ శర్మ పేర్కొన్నారు. కసాపురంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా కే సతీశ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే మనోహర్ రావు, కోశాధికారిగా పులిబాక ప్రసాద్‌ను ఎంపికచేశారు. కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు ఎస్ దుర్గా ప్రసాద్, వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా బిడ్డ మృతిపై అనుమానాలు

సెంట్రల్ వర్సిటీ అధ్యాపకురాలు యోజిత తల్లిదండ్రులు

అనంతపురం సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ యోజిత సాహూ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రంలోని అద్దె ఇంటిలో ఆత్మహత్య చేసుకున్న సెంట్రల్ వర్సిటీ అధ్యాపకురాలు యోజిత సాహూ మృతదేహానికి ఆదివారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన యోజిత సాహూ తల్లిదండ్రులు పుష్ప సాహూ, నందకుమార్ సాహూ ఆసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. యోజిత సాహూకు చెందిన ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లను తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు తెరిచే ప్రయత్నం చేశారు. ల్యాప్‌టాప్‌కు ఫింగర్ ప్రింట్, ఫోన్‌కు ఫేస్ రికగ్నిజేషన్ లాక్‌లు పెట్టడంతో ఓపెన్ కాలేదు. వాటిని టెక్నికల్ విభాగానికి పంపుతామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ యోజిత సాహూ మృతిపై అనుమానం ఉందని, త్వరగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. యోజితకు చివరగా తల్లి పుష్ప సాహూ ఫోన్ చేసిందన్నారు. స్పందించకపోవడంతో వర్సిటీలోని ఒక విద్యార్థికి ఫోన్‌చేసి విషయం తెలపడంతో ఇంటికెళ్లి చూసినట్లు తెలిపారు. అప్పటికే యోజిత ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారన్నారు. విచారణ ప్రారంభించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రభలపై దేవదేవుడి వైభవం



సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తున్న ఖాద్రీశుడు

కదిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పగటికి అధిపతి సూర్యుడు. రేయికి రారాజు చంద్రుడు. రేయింబవళ్లు కాలాదీనాలనీ, వాటితోపాటు సమస్త విశ్వానికి తానే అధిపతినని చాటి చెప్పే విధంగా లక్ష్మీనారసింహుడు ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజాహోమం అనంతరం సూర్యప్రభ వాహనం పై తిరువీధుల్లో ఊరేగారు. సంధ్యాసమయంలో చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలు, రంగురంగుల పూలతో అలంకరించిన వాహనాలను అధిరోహించిన శ్రీవారిని దర్శించుకోవడానికి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీవారి ఉత్సవానికి ముందుభాగంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు మోహినీ ఉత్సవం

శ్రీఖాద్రీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు.. మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. స్వామివారి వెనుకభాగంలో ఉండే వాలు జడ ఉత్సవం ప్రత్యేకం. కదిరి మల్లెల సౌరభం ఈ ఉత్సవంలో గుభాళించనుంది.

శ్రీవారిని దర్శించుకున్న కలెక్టర్

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కలెక్టర్ టీఎస్ చేతన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. కలెక్టర్‌కు శ్వేత వస్త్రాన్ని కప్పి సన్మానించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందించారు. ప్రధానార్చకుడు నరసింహాచారులు స్వామివారి ఆశీస్సులు అందజేశారు.

ఎండుతున్న మిరప..!

- దారుణంగా పడిపోయిన మిరప ధర
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- తక్కువ ధరకే అమ్ముకుందామన్నా కొనేవారు కరువు
- పొలాల్లోనే దిగుబడులు
- ఆందోళనలో అన్నదాతలు



ఉరవకొండ, మార్చి16(ఆంధ్రజ్యోతి): రైతు కష్టం.. చెల్లని కాసు అవుతోంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనేవారు లేరు. పంటను అమ్ముకోలేక రైతు దిక్కులు చూస్తున్నాడు. పంట దిగుబడిని పొలంలోనే ఉంచుకుని, కొనేవారి కోసం ఎదురుచూపులు చూస్తున్నాడు. అందినకాడికి అమ్ముకుందామన్నా.. కనీసం అడిగే నాథుడేలేడని ఎండుమిర్చి రైతులు వాపోతున్నారు. మిర్చి ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులకు ఈ దుస్థితి దాపురించింది. గతేడాది పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. ఈ ఏడాది తెగుళ్ల ఉధృతంగా దాడి చేయడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో చేసేదిలేక రైతులు పొల్లాలోనే రాశులు పోసుకుని, అమ్ముకునేందుకే అవస్థలు పడుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

ఉరవకొండ ప్రాంతంలో అధికంగా ఎండుమిరప సాగు చేస్తున్నారు. హంద్రీనీవా, జీబీసీ, హెచ్చెల్సీ కింద ఈ ఏడాది 30వేల ఎకరాలకుపైగా పంట పెట్టారు. హంద్రీనీవా కాలువకు నీరు వచ్చినప్పట్నుంచి మిరప సాగు పెరుగుతోంది. ఎకరాకు కౌలుతో కలుపుకుని రూ.2లక్షలదాకా పెట్టుబడులు పెట్టారు. కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. రెండేళ్ల క్రితం మిరపలోని డబ్బీ, బ్యాడిగ రకాలు క్వింటా రూ.70 వేల దాకా ధర పలికాయి. డబ్బీ, బ్యాడిగ రకాలు సాధారణంగా రూ.40 వేలకు తగ్గలేదు. అలాంటివి కూడా ప్రస్తుతం రూ.20 వేలు ధర పలుకుతున్నాయి. అందులో కూడా కాయ రకాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే క్వింటాకు రైతులు రూ.50వేలదాకా నష్టపోతున్నారు. సీడ్స్ రకాలు క్వింటా రూ.10 వేల నుంచి రూ.14 వేలలోపే పలుకుతున్నాయి. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎకరాకు రూ.40వేలు కౌలు చెల్లించి, పంట పెట్టారు. ప్రస్తుత ధరలతో ఎకరాకు అదనంగా రూ.70వేలదాకా నష్టపోతున్నారు. దిగుబడి కూడా తగ్గిందని రైతులు వాపోతున్నారు.

పేరుకుపోయిన నిల్వలు

మిర్చి ధరలు గతేడాది అమాంతం పడిపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లోనే రైతులు నిల్వ చేసుకున్నారు. ఈసారి మిర్చి కోతలు ప్రారంభమయ్యాక పాతకాయలను అడిగేవారే కరువయ్యారు. కోల్డ్ స్టోరేజీల్లో 2.4 లక్షల క్వింటాళ్ల మిరప నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్వింటా రూ.10 వేలకు కూడా అడిగే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో మిర్చిని నిల్వ చేయలేక, వాటి అద్దె చెల్లింపులకు కూడా డబ్బుల్లేక, ఎక్కువ రోజులు ఉంచితే బూజు పడుతుందన్న ఉద్దేశంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది.



ఆరబెట్టిన మిరప కాయలు

శీతల గిడ్డంగులు లేక ఇబ్బందులు

మిరప పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన శీతల గిడ్డంగులు ఇక్కడ ఐదు మండలాల్లోనూ లేవు. దీంతో రైతులు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు తరలించి, అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. బ్యాడిగి ప్రాంతానికి తీసుకెళ్తే అక్కడ నిల్వ ఉంచుకునే అవకాశం ఉండదు. మిరప పౌడైనా దిక్కుండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండలో విశాలమైన మార్కెట్ ప్రాంగణం ఉంది. ఇక్కడ క్రయవిక్రయాలు జరగవు. పెద్ద గోదాములు ఉన్నా వాటిని సాధారణ అద్దెకు బయటి వ్యక్తులకు ఇస్తున్నారు. దీంతో చాలామంది రైతులు పొలాల్లో చెట్ల కింద పంట దిగుబడిని నిల్వ చేయలేక తక్కువ ధరలకు విక్రయించుకుంటున్నారు.

కొనేవారే లేరు



12 ఎకరాల్లో మిరప సాగు చేశా. ఎకరాకు రూ.2లక్షలదాకా పెట్టుబడులు పెట్టా. కౌలు రూ.40వేలదాకా చెల్లించా. అమ్ముదామన్నా కొనేవారులేరు. దిగుబడి అంతంత మాత్రమే. క్వింటా రూ.20వేలకు మించి అడగడం లేదు.

- సుందర్‌రాజు, రైతు, వేల్పుమడుగు

అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టా



ఏడెకరాల్లో మిరప సాగు చేశా. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టా. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. పెరుగుతాయన్న ఆశతో కోల్డ్ స్టోరేజీలో ఏడాదిగా దిగుబడిని నిల్వచేశా. గత్యంతరం లేక క్వింటా రూ.15 వేలకే పది రోజుల క్రితం అమ్మేశా. వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది.

- రాంబాబు, రైతు, నింబగల్లు

మహిళలకు ఉక్కు కవచం శక్తి

మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత



మహిళా అధికారులు, ప్రముఖులతో మంత్రి, ఎమ్మెల్యే సెల్ఫీ



శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తూ..

పెనుకొండ టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉక్కుకవచం శక్తి యాప్ అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 25 మంది మహిళలను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగ, వ్యాపార, రాజకీయ తదితర అన్నిరంగాల్లో మహిళలు ముందుండాలన్నారు. కుటుంబ పోషణలో చేదోడువాదోడుగా ఉండాలని సూచించారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. మహిళలు ధైర్యంతో ముందడుగు వేయాలన్నారు. తన భర్త పరిటాల రవి ఎమ్మెల్యేగా ఉన్నపుడు తాను గృహిణిగా ఇంటికొచ్చిన వారికి అతిథి మర్యాదలు చేసేదానినన్నారు. భర్త మరణానంతరం రాజకీయాల్లోకి అడుగుపెట్టి రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానన్నారు. అనంతరం శక్తి యాప్‌ను ఆవిష్కరించారు. అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే, మంత్రి సన్మానించి, మొమెంటోలు అందించారు.

సైబర్ నేరగాళ్ల వలలో ఎల్ఐ

రూ.50వేలు పోగొట్టుకున్న వైనం

ధర్మవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ లైన్ ఇన్‌స్పెక్టర్ (ఎల్ఐ)మోసపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల మేరకు...డీ-1 సెక్షన్‌లో నాగరాజు లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సైబర్‌నేరగాళ్లు ఏఈ నాగభూషణంకు శనివారం ఫోన్‌చేసి తాము ఏసీబీ డీఎస్పీ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ కార్యాల యంలో సీనియర్ ఉద్యోగి పేరు చెప్పాలని అడిగారు. దీంతో ఆయన ఇది నిజమని నమ్మి లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పేరు చెప్పారు. ఆయనకు వెంటనే లైన్ కలపాలని సైబర్ నేరగాళ్లు ఆదేశించారు. ఏఈ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు లైన్ కలపగా 'మీరు చాలా అక్రమాలకు పాల్పడ్డారని, మీపై చర్యలు తీసుకుంటామని' బెదిరించారు. లేదంటే రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన దగ్గర అంత డబ్బు లేదని నాగరాజు చెప్పాడు. కనీసం రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇస్తానని చెప్పగా, వెంటనే ఎవరికి చెప్పకుండా రూ.50వేలు ఫోన్ పే చేయాలని సూచించారు. నాగరాజు వారు చెప్పినట్లే చేశాడు. తర్వాత ఆరా తీసి తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బ్రహ్మంనాయుడు కోసం గాలింపు

రూ.92లక్షలతో ఉడాయింపు



బ్రహ్మంనాయుడు

అనంతపురం క్రైం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని హార్మోన్‌సిటీకి సంస్థకు చెందిన డబ్బును పెద్ద మొత్తంలో తీసుకుని ఉడాయించిన బ్రహ్మంనాయుడు కోసం అనంతపురం రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మదీనాగూడ తిరుమలగిరి కాలనీకి చెందిన బ్రహ్మంనాయుడు 2021లో సంస్థలో జనరల్ మేనేజర్‌గా పని చేశాడు. ఆ సమయంలో సంస్థకు చెందిన రూ.92లక్షలు కాజేసి, పరారయ్యాడు. ఈ ఘటనపై సంస్థ ఎండీ రవికుమార్ అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు బ్రహ్మంనాయుడుపై చీటింగ్ కేసు నమోదు చేశారు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని బ్రహ్మంనాయుడు నివాసానికి నోటీసు అతికించారు.

టీడీపీ కార్యకర్త చీనీచెట్ల నరికివేత

పరిశీలించిన నాయకులు



నరికేసిన చీనీచెట్లు

పుట్లూరు, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త నాగరాజుకు చెందిన చీనీచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. నాగరాజు నాలుగు ఎకరాల్లో 500చీనీచెట్లను సాగు చేశాడు. వీటిలో మూడేళ్ల వయసున్న 110 చెట్లను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసినట్లు తెలిపారు. ఉదయం తోట వద్దకు వెళ్లిన నాగరాజుకు నరికివేసిన చెట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు పరిశీలించారు.

నీచమైన సంస్కృతి : టీడీపీ నేతలు

చెట్లు నరికివేయడం నీచమైన సంస్కృతి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మండిపడ్డారు. గరుగుచింతలపల్లిలో నరికివేసిన చీనీచెట్లను ఆదివారం పరిశీలించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట మండల కన్వీనర్ బాలరంగయ్య, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రామాంజనేయులు, చంద్ర, సోము, బ్రహ్మయ్య ఉన్నారు.

వాహనం బోల్తా

25మందికి గాయాలు.. సీమంతానికి వెళ్తుండగా ప్రమాదం



ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులు

ఉరవకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపం లో జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం బోల్తా పడటంతో 25 మంది గాయపడ్డారు. బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన వారు ఉరవకొండ మండలంలోని మోపిడి గ్రామంలో రామాంజనేయులు ఇంట్లో జరిగే సీమంతం కార్యక్రమానికి టాటాఏస్ వాహనంలో బయలుదేరారు. చిన్నముష్టూరు సమీపంలో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో వరుణ్, వినిత, నాగలక్ష్మి, లక్ష్మి, మేఘన, వనిత, వండ్రమ్మ, నాగమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం, బళ్లారి ఆసుపత్రులకు తరలించారు. ఎస్ఐ జనార్దననాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ ఎత్తివేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్‌పై కేంద్రం విధిస్తున్న జీఎస్టీ ఎత్తివేయాలని ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వారణాసి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హాల్‌లో ఆదివారం ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేయాలని, పెన్షన్ నిధులు పెంచాలన్నారు. యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ జితేంద్రకుమార్ మిశ్రా మాట్లాడుతూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను అటు బ్యాంకు ఉన్నతాధికారులు, కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు కె.రామచందర్, రమణ, కొండలరావు, శ్రీనివాస్, యదుభూషణ్ రెడ్డి, చంద్రశేఖర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అడవికి నిప్పు


మంటలను ఆర్పుతున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనంతపురం రేంజ్ పరిధిలోని ఎల్లుట్ల బీట్ పరిధిలోని చికువారి పల్లి సమీపంలోని అడివిలో అగ్గిపడింది. మంటలు అదుపుచేయడానికి అటవీశాఖ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. శనివారం సాయంత్రం ఎల్లుట్ల బీట్‌లో మంటలు చెలరేగాయి. స్థానిక బీట్ ఆఫీసర్ రవిచంద్రారెడ్డి అలర్ట్ అయి సిబ్బంది ద్వారా అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పినట్లు అయింది. ఆదివారం మరోసారి అదే ప్రాంతంలో మంటల చెలరేగినట్టు స్థానిక బీట్ ఆఫీసర్ నుంచి అధికారులకు సమాచారం అందిం చారు. దీంతో స్పందించిన డీఎఫ్ఓ విఘ్నేష్ రేంజర్ శ్రీనివాసులును పంపి మంటలను అదుపు చేసేలా తగిన జాగ్రత్తలు చేప ట్టారు. ఇది పశువుల కాపర్ల తప్పిదం వల్ల జరిగి ఉంటుందని రేంజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

● హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ


కవిత(ఫైల్)

నార్పల, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట కాలనీలో శనివారం అర్ధరాత్రి కవిత(26)అనే వివాహితపై అదే కాలనీకి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు అత్యాచారానికి యత్నించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో భర్త ఇంట్లో లేకపోవడంతో ఈ దారుణం జరిగింది. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. కాలనీలో నివాసముంటున్న కవిత, వెంకటశివ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటశివ దినచర్యలో భాగంగా శనివారం రాత్రి గ్రామ సమీపాన తోలిన గొర్రెలకు కాపలాగా వెళ్లాడు. కవిత ఒంటరిగా ఉండడాన్ని గమనించిన లక్ష్మణ్.. అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. దీంతో ఆమె అతడి చెర నుంచి తప్పించుకుని కేకలు వేస్తూ ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి, తలుపులకు గడి పెట్టుకుంది. లక్ష్మణ్ తలుపులు బద్దలు కొట్టేందుకు యత్నించ డంతో గదిలో ఉన్న కవిత మరో దారి లేదనుకుని ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు వచ్చి లక్ష్మణ్‌ను పట్టుకునేందుకు యత్నించగా అతడు పరారయ్యాడు. గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే కవిత మరణించింది. కవితను లక్ష్మణ్ వేధించేవాడనీ, అతడే చంపి ఉరేశాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కవిత తల్లి రామ సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

గోశాలకు రూ.11 లక్షల విరాళం


చెక్కు అందిస్తున్న తమ్మినేని నరసింహనాయుడు

రాప్తాడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న గోశాలకు రాప్తాడు మండలం మరూ రుకు చెందిన తమ్మినేని నరసింహ నాయుడు, రాజ కుమారి దంపతులు రూ. 11 లక్షలు విరాళం అందజేశా రు. వారు ఆదివారం గోశాల ఇన్‌చార్జ్ శ్రీధర్‌కు చెక్కు అందజేశారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి: సీపీఐ

శింగనమల, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను కూలీల ఖాతాలకు వెంటనే జమ చేయాల ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మండలంలోని చిలేపల్లి పార్టీ గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ... పలు గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉందని అధికారులు దృష్టి సాధించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉపాధి హామి బిల్లులను వెంటనే చెలించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మధుయాదవ్, నేసే మధు, బయన్న పాల్గొన్నారు.

ఎస్‌ఏజీఈ స్కూల్ మూసివేత

అనంతపురం రూరల్ , మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ. నారాయణపురంలో ఉన్న సందగమయ్య ఆకాడమీ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్, రీహ్యాబిటేషన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను మూసివేసినట్లు కరస్పాంటెండ్ క్రిష్టాజీరావు ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. కొవిడ్ కారణంగా 2021లోనే స్కూల్ మూసివేసినట్లు తెలిపారు. అయినప్పటికీ కొంత మంది పాఠశాల కోసం వస్తున్నట్లు తెలిపారు.

పేకాట ఆడుతున్న పదిమంది అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగర శివారులో పేకాడుతున్న పదిమందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఆదివారం రాత్రి దాడులు నిర్వహించి టీవీ టవర్ వద్ద పేకాడుతున్న పదిమందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.17,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

శింగనమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగుల గుడ్డం గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణ ఆదివారం ఓ నిరుపేద జంట వివాహానికి బంగారు తాళిబొట్టు, పెళ్లి ఖర్చుకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వాటిని ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు.

కొనసాగిన ఇళ్ల కూల్చివేత

అనంతపురంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట పంచాయతీ విద్యారణ్య నగర్‌లోని ప్రైవేట్ స్థలంలో రెవెన్యూ అధికారులు చెపట్టిన ఇళ్ల కూల్చివేత ఆదివారం కూడా కొనసాగింది. పాపంపేట సర్వే నెంబరు 106-1లోని 68సెంట్లలో ఉన్న ఇళ్ల తొలగింపు ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టారు. తహసీల్దార్ మోహన్‌కుమార్‌తోపాటు వీఆర్వోలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికంగా ఉండి ఇళ్ల కూల్చివేత పనులను పర్యవేక్షించారు. ఈక్రమంలో స్థానికంగా ఉన్న పెద్ద భవనాలు నేలమట్టం కావడం కనిపించింది.


విద్యారణ్యనగర్‌లో భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

బడ్జెట్ అంశంతోనే సరిపెడతారా..?

● వివాదం రేపుతున్న ఫ్లైఓవర్ నామకరణం
● ఎమ్మెల్యే వర్సెస్ మేయర్..?
● అందరిచూపు వారిపైనే..
● నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం


నగరపాలక సంస్థ కార్యాలయం

అనంతపురం క్రైం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): కేవలం బడ్జెట్ అంశంతోనే కౌన్సిల్ సమావేశం జరుగుతుందా...? మరి కొన్ని అంశాలపైనా చర్చ నడుస్తుందా...? అనేది చర్చనీయాంశంగా మారింది. నగర పాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో సోమవారం బడ్జెట్ అంశంపై సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుత పాలకవర్గం ప్రతి ఏటా బడ్జెట్ అంశంపైనే ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, సభ్యులు వివిధ అంశాలపై ప్రశ్నించేవారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన నిధులు మొదలుకొని పారిశుధ్యం పనుల వరకు చర్చ నడుస్తూ వచ్చేది. ఈ క్రమంలో సోమవారం నిర్వహించే కౌన్సిల్ సమావేశం ఎలా నడుస్తుందనే విషయం ఆసక్తి కరంగా మారింది. గత వారంలో రూ. 135 కోట్లతో బడ్జెట్ అంశంపై ఐదుగురితో స్టాండింగ్ కమిటీలో ఆమోదం తెలిపారు. ప్రస్తుత పాలవకర్గం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తి కావస్తోంది. ఈ నేపథ్యంలో పలు అంశాలపైనే చర్చ నడిస్తే సభ్యుల మధ్య తలెత్తే వాగ్వాదంతో సమావేశం మరింత వాడివేడిగా సాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

వివాదం రేపుతున్న బ్రిడ్జి నామకరణం

నగరంలోని బళ్లారి బైపాస్ నుంచి పంగల్‌రోడ్డు వరకు 9.2 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి నిర్మించారు. అందులో భాగంగా టవర్‌క్లాక్ ఎదుట ఫ్లైఓవర్‌ను మార్చి కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జికి ఇంకా పేరు పెట్టనే లేదు. కొంతకాలంగా ఈ బ్రిడ్జి పేరు విషయంలో తమ హయాంలోనే నిర్మించామని తాము నిర్ణయించిన పేరునే పెట్టాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అదే క్రమంలో మరో పేరును పెట్టాలని టీడీపీ కొంతకాలంగా తన గళం వినిపిస్తోంది. ఇక పలు ప్రజాసంఘాలు కొత్త పేర్లను ప్రతిపాదిస్తున్నాయి. ఈ విషయంలో ఇదివరకే కమిషనర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అనేకసార్లు వినతులందాయి. ప్రస్తుతం ఈ బ్రిడ్జి పేరుపై సమావేశంలో తీర్మాణం చేయాలనే చర్చ నడుస్తోందట. మరి సమావేశంలో అదే అంశంపైనే చర్చ నడిస్తే వాదోపవాదాలు, చర్చోపచర్చలు బ్రిడ్జి చుట్టూనే నడుస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అందరి దృష్టి ఆ ప్రజాప్రతినిధులపైనే..

ఒకరు అనంతపురం నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి. మరొకాయన ప్రస్తుత పాలకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి. వీరిద్దరూ కొంతకాలంగా పరస్పర ఆరోపణలు చేసుకునే వరకు పరిస్థితి వచ్చింది. ఇందుకు ముఖ్యకారణం డంపింగ్‌యార్డు బిల్లు. గుత్తి రోడ్డులోని డంప్‌యార్డులో బయో మైనింగ్ పేరుతో వైసీపీ హయాంలో రూ. 26 కోట్లతో ప్రాజెక్టు నడిచింది. పని పూర్తి కాకుండానే పూర్తయినట్లు నివేదించారని, కొంత శాతం బిల్లు చేశారనే ఆరోపణలున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రూ. 5కోట్లు వరకు, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరో రూ. 4కోట్లకు బిల్లు అయింది. వాటిని ఎలా చేశారనే అంశంపైనా గత కౌన్సిల్ సమావేశాల్లో చర్చ నడిచింది. అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రస్తావించగా, జరగలేదని అవసరమైతే విచారణ చేయించాలని మేయర్ మహమ్మద్ వసీం చెప్పుకొచ్చారు. తాజాగా అదే అంశంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచింది. కౌన్సిల్ సమావేశంలో మరోసారి ఆ అంశం చర్చకు వస్తే ఏం జరుగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇక నగరంలో అనేక సమస్యలపైనా సభ్యులు తమ గళం వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడు సమావేశం జరిగినా, పారిశుధ్యంపైన చిన్న సమస్యల నుంచి పెద్ద సమస్యల వరకు కార్పొరేటర్లు చెప్పుకొచ్చే పరిస్థితి ఉంది. దీంతో సమావేశం ఎలా నడుస్తుందో..? వేచి చూడాల్సిందే.

తాగునీటికి కటకట


డ్రిప్పు వైరు ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

శింగనమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లి బీసీ కాలనీ వాసులు తాగునీటిని డ్రిప్పు వైరు ద్వారా పట్టు కోవాల్సి వస్తోంది. గ్రామంలో జరిగిన జాతీయ రహదారి పనుల సమయంలో బీసీ కాలనీ చెందిన తాగునీటి పైపులైన్లు చాలా మటుకు ధ్వంసం అయ్యాయి. దీంతో వారు ఊరు చివర కొంత బాగున్న పైపు లైన్‌కు డ్రిప్పు వైరు తగిలించుకుని తాగునీటిని పట్టుకుంటున్నారు. కాలనీలో దాదాపు వంద కుటుంబాలు ఉన్నాయి. కాలనీలోని డ్రిప్పు పైపు ద్వారా ఒక్కో కుటుంబం రోజుకు నాలుగు నుంచి ఆరు బిందెల వరకు వంతుల వారీగా నీటిని పట్టుకుంటూ కాలం గడుపుతున్నారు. ఇలా దాదాపు మూడేళ్లు కావస్తోంది. దీంతో కాలనీ మహిళలు దాదాపు 20 రోజులు కిందట పెద్ద ఎత్తున రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కాలనీకి నూతన పైపైలైన్లు వేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశంతో అధికా రులు కాలనీకి సంబంధించి రోడ్డుపక్కన నూతన పైపులైన్ వేసి కొళాయి లు ఏర్పాటు చేశారు. కానీ పైపులైన్ ఎత్తు ప్రాంతంలో ఉండడంతో పాత బోరు నుంచి నీరు ఎక్కడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీంతో కాలనీకి నీరందడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీకి నీరు ఎలా సరఫరా చేయాలో ఆర్థం కాలేదని కొందరు అధికారులు అంటున్నారు. అయితే తగిన చర్యలు తీసుకుని తమకు తాగు నీటి కష్టాలు పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న నూతన పైపులైన్

అమరజీవికి ఘన నివాళి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం చంద్ర బాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నగరంలోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాముల 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగులు విగహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించడాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయన్నారు. నాయకులు గంగారామ్, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, దళవాయి వెంకట నారాయణ, లక్ష్మీనరసింహ, కృష్ణం రఘు, తాటి మధు, గోపాల్ గౌడ్, ఓంకార్‌రెడ్డి, ఇస్మాయిల్, వెంకటేశ్వరరెడ్డి, నెట్టెం బాలకృష్ణ, వన్నూరప్ప పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. పాతూరు అమ్మవారిశాల నుంచి పొట్టి శ్రీరాములు చిత్రపటంతో నగరంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లోని ఆయన విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, పాతూరు అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, తిరువీధుల జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే క్లాక్‌టవర్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కొత్తూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

● అనంతపురం అర్బన్/సెంట్రల్: టీడీపీ అర్బన్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జేఎన్టీయూలో వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


పాతూరులో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్యులు


క్లాక్‌టవర్ వద్ద నివాళులర్పిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు


టీడీపీ నాయకుల నివాళి


నివాళులర్పిస్తున్న జేఎన్టీయూ వీసీ, సిబ్బంది

నిరుపయోగంగా అభ్యుదయ భవన్

● రూ. 25లక్షలతో చేసిన పనులకు తుప్పు
● పదేళ్లుగా పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న డీఆర్‌డీఏ అభ్యుదయ భవన్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగర నడి బొడ్డున సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా ఉన్న డీఆర్‌డీఏ అభ్యుదయ భవన్ పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. 1986లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కుముద్‌బెన్ జోషి చేతుల మీదుగా అభ్యుదయ భవన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి 2014 వరకు అంటే సుమారు 32ఏళ్ల పాటు ఎన్నో సమీక్షలు, సమావేశాలు, సభల నిర్వహణకు ఆ భవనం వేదికైంది. అనంతరం అభ్యుదయభవన్ నిర్వహణ బాధ్యతను డీఆర్‌డీఏకు అప్పగించారు. శిథిలావస్థకు చేరిన భవనానికి 2014లో అప్పటి కలెక్టర్ కోన శశిధర్ ప్రత్యేక చొరవతో రూ.25లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. దెబ్బతిన్న గోడలకు మరమ్మతులు చేశారు. మరుగుదొడ్లు నిర్మించారు. రంగులు వేశారు., ఏసీలు ఏర్పాటు చేశారు. ఇంకా అభ్యుదయ భవన్ లోపల కూర్చోవడానికి కుర్చీలు, ఇతర ఫర్నీచర్ కోసం మరో రూ. 30 లక్షల వరకు నిధులు అవసరం ఉంది. అప్పట్లో ఆ కలెక్టర్ బదిలీపై వెళ్లిపోయారు. ఇక తరువాత వచ్చిన కలెక్టర్లు, డీఆర్‌డీఏ పీడీలు అభ్యుదయభవన్ గురించి పట్టించుకోలేదు. దీంతో 2014లో రూ. 2లక్షలతో చేసిన మరమ్మత్తులు, ఏసీలు పనికిరాకుండా పోయాయి. మిగిలిన ఏసీలతో పాటు ఐరన్, ఇతర సామగ్రి తుప్పు పట్టింది. అభ్యుదయభవన్ నిరుపయోగంగా మారి పోయింది. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య వివరణ ఇస్తూ... కలెక్టర్ వినోద్ కుమార్ అభ్యుదయబవన్ ను పరిశీలించారని తెలిపారు. దానిని తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి ఏయే పనులు చేపట్టాలి? ఎంత నిధులు అవసరం అవుతాయో అంచనా వేయాలని ఇప్పటికే ఏపీడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో అభ్యుదయ భవన్‌లో ఫర్నీచర్ ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబం


శ్రీవారిని దర్శించుకుని వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆయన కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వర స్వామి సుప్రభాత సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదివారం తెల్లవారుజామున సతీమణి శ్రీలక్ష్మి, కుమారుడు, కుమార్తెలతో కలిసి స్వామి వారిని దర్శించుకుని, మొక్కు తీర్చుకున్నారు.

రంజాన్ తోఫాపై సీఎంను కోరతా

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


ముస్లింలకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు తిరిగి రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబును కోరతానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి గుల్జార్ పేటలోని మసీదులో టీడీపీ మైనార్టీ నాయకుడు ఖలందర్, ఆజాద్ నగర్‌లో టీడీపీ నాయకుడు నూర్ మహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ముస్లిం మత పెద్దలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు స్వయంగా ఇఫ్తార్ విందు భోజనాన్ని వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు పాటుపడుతున్నారన్నారు. రంజాన్ పండుగకు మసీదుల మరమ్మతుల కోసం నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌస్ మొద్దీన్, సైఫుద్దీన్, ఫిరోజ్ అహ్మద్, సుధాకర్ యాదవ్, బాబాఫకృద్దీన్, సికిందర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లికి చెందిన దిలీప్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి రూ.1,06,900 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఎమ్మెల్యే ఆదివారం సాయంత్రం నగరంలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలసి చెక్కును అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి, టీడీపీ నాయకులు మాధవరాజు, పెద్దన్న, అనిల్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

అదే నిర్లక్ష్యం..!

● ఎస్సీ హాస్టల్ మరమ్మతుల్లో డొల్లతనం బట్టబయలు


క్యూరింగ్ కాని సిమెంట్ ఇటుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో జరుగుతున్న రెండో విడత మరమ్మతుల పనుల్లో మరోసారి డొల్లతనం బయటపడింది. కాంట్రాక్టర్లు ఆదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గత నెల ఆంధ్రజ్యోతిలో 'నాణ్యత ప్రశ్నార్థకం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఇందుకు ఆ శాఖ అధికారులతో పాటు ఏపీఈడబ్ల్యూఐడీసీ శాఖ డీఈ పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్లకు హెచ్చరికలు జారీచేశారు. అయినా వారు మరోసారి నిబంధనలకు, నాణ్యతకు తిలోదకాలిచ్చారనే చెప్పాలి. నగరంలోని ఎస్సీ నెం-4 ప్రీమెట్రిక్ హాస్టల్‌లో జరుగుతున్న పనులను డీఈ రమణారెడ్డి ఇటీవల పరిశీలించారు. అక్కడ కాంట్రాక్టర్ లేకపోగా, మోటార్ పైపులైన్ పనులు అస్తవ్యస్తంగా కనిపించాయి. దీంతో డీఈ అక్కడ పనులు చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మరుగుదొడ్ల నిర్మాణానికి క్యూరింగ్ కానట్టి సిమెంట్ పెళ్లలు అక్కడుండటం గమనించి అసహనం వ్యక్తం చేశారు.

ఏఈలు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు..?

జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతగృహాల్లో చేపడుతున్న పనుల్లో కొందరు ఏఈలు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు వ్యవహారంతోనే నాసిరకం పనులు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ బాధ్యతలను డివిజన్ల వారీగా ఏఈలకు అప్పజెప్పారు. వారు ఇష్టానుసారంగా ప్లానింగ్, ఎస్టిమేషన్‌లు వేస్తూ నాణ్యతకు తిలోదకాలిస్తున్నట్లు విమర్శలున్నాయి. నాసిరకపు మెటీరియల్‌తో పనులు చేపడుతున్నారని, ఉన్నతాధికారులు చూసీచూడనట్లు ఉండటంతో ఇలా జరుగుతోందని ఆయాశాఖల అధికారులే అంటున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వసతిగృహాల మరమ్మతు పనులను నాణ్యంగా చేపట్టాలని పదే పదే చెబుతున్న కలెక్టర్ ఈ నాసిరకపు పనులపై ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

పైపులైన్ పనులు సక్రమంగా లేవు

ఎస్సీ నం-4 వసతిగృహంలో మోటార్ పైపులైన్ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. ప్రతిరోజూ ప్రతి హాస్టల్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్నాం. అందులో భాగంగా నం-4 హాస్టల్‌లో పనుల పరిశీలనలో పైపులైన్ పనులు సక్రమంగా చేయకపోవడం కనిపించింది. సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించాం. పనుల విషయంలో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవు.

-రమణారెడ్డి, డీఈ, ఏపీఈడబ్ల్యూఐడీసీ


పైపులైన్ నుంచి లీకేజీ అవుతున్న నీరు

సంక్షిప్త వార్తలు

హామీలను తక్షణమే అమలు చేయాలి: ఏఐవైఎఫ్

రాయదుర్గంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొత్రేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు ఆదివారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ భృతి ఇస్తామని రూ. 25 వేలతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లను కొనసాగించి పదివేల గౌరవేతనం ఇస్తామని చెప్పి.. ఇప్పటివరకు వాటిపైన ప్రస్తావించిన సందర్భం లేదని అన్నారు. నిరుద్యోగులను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పి తొమ్మిది నెలలవుతోందని, ఇప్పటివరకు రాష్ట్ర బడ్జెట్‌లో రాష్ట్ర యువతకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. కేవలం మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్రంలో ఉన్న నిరద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేవారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు కుమార్, నాయకులు నాగయ్య, గంగాధర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అరటితోట దగ్ధం

బెళుగుప్ప, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో రైతు నరసింహులుకు చెందిన రెండున్నర ఎకరాల అరటితోట ఆదివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైంది. తోటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయని, దీంతో చేతికొచ్చిన అరటి పంటతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయని బాధిత రైతు వాపోయారు. రూ. ఐదు లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

శ్మశానవాటికను ఆక్రమణ నుంచి కాపాడాలి

రాయదుర్గంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సున్నపురాల గుట్ట శ్మశాన వాటికను ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక ఏపీఎన్జీఓ భవనంలో ఆదివారం ఆయన పలు రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సున్నపురాల గుట్ట శ్మశానవాటికను పలువురు దేవాలయ నిర్మాణం పేరు మీద దౌర్జన్యంగా ఆక్రమించారని, అంతేకాకుండా అక్కడి విలువైన మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. స్థానిక తహసీల్దార్ బెస్త కులస్థులకు ఇక్కడ శ్మశానవాటిక లేదంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు శ్మశానవాటిక సమస్యపై తమ మద్ధతు పలికి అధికారులు ఆ శ్మశాన వాటిక ఆక్రమణకు గురి కాకుండా కాపాడాని కోరారు. కార్యక్రమంలో బెస్త సంఘం పట్టణ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శులు నాగరాజు, సీపీఎం నాయకులు మల్లికార్జున, పార్టీ నాయకుడు వెంకటరమణబాబు, ఏఐవైఎఫ్ నాయకుడు కొత్రేష్, పద్మశాలి సంఘం నాయకులు, బెస్త సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

పుట్లూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు ఆగిపోవడంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో కమీషన్ల గ్రహణం అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆ అధికారిపై ఆరాతీసినట్లు సమాచారం. మండలంలో అభివృద్ధి పనులు ఆపకుండా పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయం నుంచి ఆ అధికారి తీరుపై ఆరాతీసినట్లు తెలుస్తోంది. సోమవారం వీటిపై ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

ప్రశాంత జీవితాన్ని గడపాలి: సీఐ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయనాయక్

రాయదుర్గం రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రజలు గొడవలకు పోకుండా ప్రశాంత జీవనం గడపాలని సీఐ జయనాయక్ సూచించారు. మండలంలోని మెచ్చిరి గ్రామంలో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత అనుమానితులు, పాత నేరస్థుల ఇళ్లను తనిఖీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఎవరూ ఎలాంటి కక్షలు పెట్టుకోకూడదని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని తెలిపారు. ఏవేని సమస్యలు వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.

చలో విజయవాడకు తరలిరండి: సీఐటీయూ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 19వ తేదీ సీఐటీయూ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం జరగనుందని, విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు తాగునీటిని అందిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న శ్రీరామరెడ్డి పథకం కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ప్రధానంగా కార్మికులకు పెండింగ్ వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న డిమాండ్‌తో అక్కడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాల పరిశీలన

బెళుగుప్ప, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లిలో ఆదివారం జరిగిన పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యాక్రమాన్ని పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. పశువుల చెవిపోగులకు గుర్తింపు నెంబరు వేసి ఆ తర్వత టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యుడు రమేష్, సిబ్బంది సూచించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బెళుగుప్ప, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందిన మండలంలోని నరసాపురం అంగన్‌వాడీ ఆయా లక్ష్మీదేవి అంత్యక్రియలకు సీడీపీవో సుశీల రూ.15వేల ఆర్థికసాయం అందించినట్లు మండల అధ్యక్షురాలు సత్యవతి తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారన్నారు. అలాగే పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పరామర్శించి ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



అమర్‌నాథ్ మృతదేహం

కూడేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన అమర్‌నాథ్ (25) అనే వ్యవసాయ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. అమర్‌నాథ్ రైతుల తోటల్లోకి కూలి పనులకు వెళ్లేవాడు. అలాగే గొర్రెల కాపరిగా కూడా పని చేసేవాడు. అయితే గతంలో రూ.20 వేలు అప్పు చేయగా.. వడ్డీ పెరిగి దాదాపు రెండులక్షల వరకు అయింది. దీంతో ఆ అప్పు తీర్చలేనని మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఇంటి బయట నిద్రించిన కుటుంబ సభ్యులు ఆదివారం తెల్లవారు జామున ఇంటి తలుపులు తెరవగా అమర్‌నాథ్ ఉరికి వేళాడుతూ కనిపించాడు. వెంటనే కిందకి దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి కొండన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య భవాని, కుమారుడు ఉన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు..

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బొమ్మనహాళ్‌లోని వడ్డే క్యాంప్‌లోని రోడ్డుపై భారీగా ఉన్న గుంతలు



కంకర తేలిన శెట్టూరు మండలంలోని లింగదీర్లపల్లి రోడ్డు

బొమ్మనహాళ్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డే క్యాంప్‌లో బళ్లారికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. పెద్దఎత్తున గుంతలు పడడంతో ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్మాగారాలకు వెళ్లే భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. మరమ్మతులు చేయాల్సిన సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డులో కురువళ్లి గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద భారీ గుంతలు పడ్డాయి. ఈ మార్గంలో విద్యార్థులు, కూలీలను తరలించే ఆటోలు అతి వేగంతో వస్తుంటాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వీధి లైట్లు కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో వచ్చే వాహనదారులకు గుంతలు సరిగా కనిపించే పరిస్థితి లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా లింగదీర్లపల్లి రోడ్డు

శెట్టూరు: మండలకేంద్రంలోని నుంచి లింగదీర్లపల్లి మీదుగా బొచ్చుపల్లికి వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది. దీంతో దానిపై ప్రయాణించాలంటే నరకం కనపడుతోందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు జంకుతున్నారు. ఆ రోడ్డుపై వెళ్లాలంటే చాలా నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోందని, మండలకేంద్రానికి చేరాలంటే గంటల సమయం తీసుకుంటోందని, ఏదేని అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ఇక అంతే సంగతులని ఆయా గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పం దించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు పనులు చేయాలి



లింగదీర్లపల్లి - బొచ్చుపల్లి ప్రధాన రహదారి రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలి. ఆ రోడ్డులో పెద్దఎత్తున కంకర తేలి ఉండడం వల్ల ద్విచక్రవాహనాల్లో సైతం తిరగలేని పరిస్థితి నెలకొంది.

- నాగరాజు, లింగదీర్లపల్లి

ప్రయాణం ఆలస్యమవుతోంది..



రోడ్డుపై కంకర తేలి ఉండడం వల్ల ప్రయాణం ఆలస్యంగా సాగుతోంది. మా గ్రామం నుంచి మండలకేంద్రానికి వెళ్లాలంటేనే చాలా సమయం పడుతోంది. ఏదేని అత్యవసర పరిస్థితి ఉంటే ఇబ్బందే.

- చంద్రన్న, లింగదీర్లపల్లి

అమరజీవి అడుగుజాడల్లో నడుద్దాం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపు
- జయంతి సందర్భంగా పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి



కళ్యాణదుర్గంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని తదితరులు



గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

కళ్యాణదుర్గం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన మహోన్నతుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. పొట్టిశ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆర్యవైశ్యసంఘం, వైసీపీ నాయకులు అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్, నాయకులు సుదర్శన్, మధుసూదన్‌గుప్తా, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, కార్యాలయ సిబ్బంది పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దారు నారాయణస్వామి, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే ఆవోపా నాయకులు స్థానిక అజంతా సర్కిల్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాడికి: మండలకేంద్రంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు విశ్వనాథ్, టీకే నాగరాజు, పవన్, ప్రదీప్, రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నిరంజన్‌గౌడ్, రామాంజనేయులు, ప్రభాకర్, రవి, ఈడిగ వేణు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

యాడికి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు గ్రామంలోని భూవివాదంపై మాదాల భాస్కర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం 8మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మాదాల భాస్కర్ తల్లిపేరు మీద సర్వేనెంబర్ 650/బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లలో 1.25 ఎకరాల స్థలం ఉంది. అయితే ఆ స్థలాన్ని అతను షాపుల కోసం బాడుగకు ఇచ్చారు. కాగా ఈ నెల 11వ తేదీన కొంతమంది వ్యక్తులు ఈ స్థలం మాది.. మీరు ఖాళీ చేయాలని బెదిరించారు. సమాచారం అందుకున్న మాదాల భాస్కర్ వర్గీయులు అక్కడకు వెళ్లి వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఇరు వర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. తర్వాత రాత్రి 8:30గంటల సమయంలో కారులో వెళుతున్న మాదాల భాస్కర్ వర్గీయులను స్థల ఆక్రమణకు వచ్చిన వ్యక్తులు కారుతో ఢీకొట్టారు. స్థలం విషయంలో మీరు జోక్యం చేసుకుంటే చంపుతామని బెదిరించారు. ఈ వివాదానికి రాయలచెరువుకు చెందిన ఒక వ్యక్తి కేశవరాయునిపేట గ్రామానికి చెందిన మరొక వ్యక్తి ముఖ్య కారకులు గా తెలిసింది. ఈ మేరకు మాదాల భాస్కర్ ఫిర్యాదు ఇవ్వడంతో దాదావలి, అజీజ్, వినోద్‌కుమార్‌రెడ్డి, ఇమాంబాషా, ఆదినారాయణరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, రామకృష్ణ, రామ్మోహన్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

యాడికి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో నుంచి జారిపడి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని వేములపాడు-జూటూరు రైల్వేస్టేషన్‌ల మధ్యలో జరిగింది. గుత్తి రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హొస్పేటకు చెందిన శ్రీనివాస్ తిరుమలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి నుంచి గుంతకల్లుకు బయలుదేరాడు. అయితే మార్గంమధ్యలో ప్రమాదవశాత్తూ రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామని చెప్పారు.

అనుమతుల్లేకుండా వెంచర్ ఎలా వేస్తారు?

పుట్లూరు, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామ శివారులో గల వంక ప్రాంతంలో కొందరు అనుమతులు లేకుండా వెంచర్ వేయడాన్ని ఆ గ్రామ సర్పంచు భారతి ఆదివారం అడ్డుకున్నారు. వ్యవసాయ భూముల్లో పంచాయతీ, మండల అధికారుల అనుమతి తీసుకోకుండా వెంచర్ ఎలా వేస్తారని మండిపడ్డారు. మండల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యాడికి అభివృద్ధికి పాటుపడదాం: జేసీపీఆర్



విలేకరులతో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి16(ఆంధ్రజ్యోతి): యాడికి మండల అభివృద్ధి కోసం అందరం పాటు పడదామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాడికిలోని చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి భూములు దాదాపు 1100ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, ఈ భూములన్నీ ఎవడబ్బ సొమ్ము అని రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని మండిపడ్డారు. ఇలానే వదిలితే హుండీ ఆదాయాన్ని కూడా దోచేస్తారని, ఇక ఇలాంటివి సాగనివ్వనని అన్నారు. యాడికి మండల అభివృద్ధితో పాటు ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. అమరావతిలో నారా లోకేష్ తాడిపత్రి పట్టణం గురించి మాట్లాడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాడిపత్రి పట్టణాన్ని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎలా చేశాడో.. మనం ఇక్కడ కూడా అలాగే చేద్దామని లోకేష్ పారిశుధ్య కార్మికులతో చెప్పారని, తనకు ఇంతకన్నా ఏమి కావాలని భావోద్వేగానికి గురయ్యారు. పట్టణంతోపాటు నియోజకవర్గం అంతా అలాగ అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. యాడికిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా పూర్తిచేశామని అన్నారు. ఆ ఆలయానికి అంత భూమి ఉన్నా ఉత్సవాలకు ప్రజల దగ్గర అడుక్కోవాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ఇలాంటి పరిస్థితి వచ్చే సంవత్సరం రానివ్వనని అన్నారు. ఆలయ భూమిని ఎవరెవరు ఆక్రమించుకున్నారో తెలుసునని, త్వరలోనే అన్యాక్రాంతమైన భూముల్ని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. యాడికిలో నీటికొరత లేకుండా చేస్తామని, పారిశుధ్య చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బాధ్యతలు తీసుకుంటామని, మీ అందరూ సహాయ సహకారాలు అందిస్తే ఆలయ ప్రెసిడెంట్ అవుతానని చెప్పారు. ప్రజల కోసం ఎంత దూరమైనా వెళతానని అన్నారు.

వేధిస్తున్న నర్సుల కొరత

- ప్రభుత్వాస్పత్రిలో పది పోస్టులు ఖాళీ
- ఉన్నవారిపై పని భారం



గుంతకల్లు ప్రభుత్వాస్పత్రి

గుంతకల్లుటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నర్సుల కొరత అధికంగా ఉంది. గత ఆరు నెలలుగా పది నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రోగులకు అరకొరగా వైద్యసేవలందుతున్నాయి. ఆస్పత్రిలో ఓపీకి ప్రతిరోజు వందల సంఖ్యలో వస్తుంటారు. అందులో 50మంది దాక అడ్మిట్ అవుతుంటారు. నర్సుల కొరత కారణంగా వారికి వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో రోగులకు సెలైన్ బాటిళ్లు ఎక్కించడానికి, ఇంజక్షన్లు వేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీంతో రోగులు, వారి బంధువులు ఉన్న అరకొర నర్సులతో గొడవకు దిగుతున్నారు. క్యాజువాలిటీ వార్డులో ఒకరు, ఇంజక్షన్ వేసేందుకు ఒకరు, మెడికల్ వార్డులో ఒకరు, పీడియాట్రిక్ వార్డులో ఒకరు, సర్జికల్ వార్డులో ఒకరు, లేబర్‌వార్డులో ఇద్దరు, కాన్పులవార్డులో ఒకరు చొప్పున మాత్రమే నర్సులు ఉన్నారు. మధ్యాహ్నం, రాత్రి షిఫ్టలలో 8మంది నర్సులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే నర్సుల కొరత ఉండడంతో ఆయా షిప్టులలో కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న అతి కొద్ది మంది నర్సులకు పని భారం అధికవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఆసుపత్రికి అధికంగా వస్తుంటారు. ఆ సమయంలో క్యాజువాలిటీలో ఉన్న ఒక నర్సుపై పని ఒత్తి డి పెరుగుతోంది. నర్సుల పోస్టుల భర్తీ చేయాలని పలుమార్లు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న నర్సుల పోస్టులను భర్తీ చేయాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న నర్సుల పోస్టులను భర్తీ చేయాలని జిల్లా వైద్యాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాము. త్వరలో నర్సుల పోస్టులను భర్తీ చేస్తామని వారు హామీ ఇచ్చారు. తెలిపారు.

-ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- హాజరైన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



ధ్వజస్తంభానికి మొక్కుతున్న కాలవ

కణేకల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు, వేద పండితులు ప్రాతఃకాల పూజలు, మహన్యాస పారాయణం, సుందరకాండ పారాయణం, నవగ్రహ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత 10:25కు ధ్వజస్తంభాన్ని, శిఖర కలశాన్ని వేదమంత్రోచ్ఛారణలో, శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, గణపతిహోమం, రుద్రహోమం, ప్రదోష పూజలు జరిపారు.భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు, ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయన స్థానిక టీడీపీ నాయకుడు ఆది నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాటా మంతీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్, కోకిర్తి సుదర్శన్, బీటీ రమేష్, బసవరాజు, వన్నారెడ్డి, ఎస్‌కే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిప్పేరుద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

బ్రహ్మసముద్రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరడికెర గ్రామంలో గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం చిత్తా నక్షత్రం రోజున కర్ణాటకలోని నాయకనహట్టిలో జరిగే తిప్పేరుద్రస్వామి రథోత్సవం రోజునే ఇక్కడ కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని రథంలో కొలువుదీర్చి అశేష భక్తజనం నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో పెన్ననర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు పెన్ననర్లు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పెన్ననర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు సంగటి వీరారెడ్డి, హనుమంతరెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

తాడిపత్రి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఫయాజ్‌బాషా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దాదాపు 30 మసీదుల ఇమామ్‌లకు, మౌజన్‌లకు రంజాన్ కానుకల పంపిణీ జరిగింది. ఇమామ్‌లకు ఒక్కొక్కరికి రూ.6500, మౌజన్‌లకు రూ.3500 నగదు, ఒక జత దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు ఫయాజ్‌బాషా మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి రంజాన్ పండుగ సందర్భంగా ఇమామ్‌లకు, మౌజన్‌లకు కానుకలు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో ల్యాబ్ అందుబాటులో ఉంచి షుగర్, బీపీ వంటి టెస్టులు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గుంతకల్లుటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీఎస్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఆదివారం హెచ్ఎం నాగమణి పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల యాజమాన్యం సహకారంతో విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు.

బస్సు సౌకర్యం..

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి, తీసుకొచ్చేందుకు జిందాల్ సాప్ ఫ్యాక్టరీ యాజమాన్యం బస్సు ఏర్పాటు చేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. చంద్రగిరి హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష కేంద్రాన్ని ఉద్దేహాళ్‌లోని హైస్కూల్లో ఏర్పాటు చేశారు. దీంతో 12 కి.మీ దూరం అవుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసే సమయానికి చేరుకునేలా ఫ్యాక్టరీ యాజమాన్యం బస్సును ఏర్పాటు చేసింది. నేటి నుంచి ఈనెల 31 తేదీ వరకు బస్సు నడవనుంది.

ఏపీ దళిత మహాసభ పట్టణ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో గల బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన్ కేంద్రంలో ఆదివారం ఏపీ దళిత మహాసభ నాయకులు సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కన్వీనర్ కత్తి నాగయ్య, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ రంగన్న, కౌన్సిలర్ విద్యారాణి, కేవీపీఎస్ నాయకుడు జగ్గలిరమేష్, స్వామిదాస్ పాల్గొన్నారు. వారు మహాసభ పట్టణ నూతన కమిటీని ఎన్నిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్ కృష్ణయ్య, ఎమ్ రంగన్న, కేఎస్ జగన్నాథ్, అధ్యక్షుడిగా నగరజీన్ వీరేష్, ఉపాధ్యక్షులుగా నరసింహులు, నరసప్ప, చింతకుంట శ్రీనివాసులు, మోషే, ప్రభాకర్, కార్యదర్శిగా చిన్నఎల్లప్ప, సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్, హరిచంద్ర, తలారిమస్తానప్ప, రాంబాబు, సుంకన్న, నిర్మాణ కార్యదర్శిగా రవి, సంయుక్త కార్యదర్శులుగా హరిబాబు, జయరాం, కోశాధికారిగా జోసెఫ్ కుమార్, సహాయ కోశాధికారిగా నాగేష్‌తో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఏడీఏ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



మంటలార్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

ఉరవకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఏడీఏ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయంలో వెనుక ఉన్న చెత్తను తగలబెట్టడంతో మంటలు వ్యాపించాయి. దీంతో వ్యవసాయ డివిజన్ కార్యాలయం సంబంధించిన రికార్డులు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.